క్లుప్తంగా

రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు



చెట్ల తొలగింపును పరిశీలిస్తున్న సీఐ సోమశేఖర్

కొండపి: ప్రమాదాల నివారణ కోసం రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగిస్తున్నట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డ్రైవ్‌లో భాగంగా బుధవారం కొండపి నుంచి టంగుటూరు వెళ్లే రహదారిలో గురుకుల పాఠశాల సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్ల చెట్లను, కొమ్మలను డోజర్ సాయంతో తొలగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. ఎస్సై ప్రేమ్‌కుమార్, ఏఎస్ఐ అంకారావు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సత్య సమీక్ష



మాట్లాడుతున్న దామచర్ల సత్యనారాయణ

మద్దిపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం పార్టీ నాయకులతో చర్చించారు. ఆయన వెంట ఎంపీడీఓ జగదీష్, పార్టీ నాయకులు ఉన్నారు.

భాషా నైపుణ్యత ఉత్సవాలు



తూర్పునాయుడుపాలెంలో భాష నైపుణ్యత ఉత్సవాలు

టంగుటూరు: మండలంలోని తూర్పునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సబ్జెక్టులపై భాషా నైపుణ్యత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం సుధారాణి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 21 వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో భాషా నైపుణ్యత ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదట తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తెలుగులో బి.జ్యోతి, హిందీలో ఈశ్వరమ్మ, ఇంగ్లిష్లో బి.శ్రీనివాసరావులు విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చారు. పాఠశాల సిబ్బంది మాధురి, సురేష్, ఉమాదేవి పాల్గొన్నారు.

హెల్మెట్ ప్రాణాలకు రక్ష



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

టంగుటూరు: హెల్మెట్ ప్రాణాలకు రక్షని సింగరాయకొండ సీఐ చావా హజరత్తయ్య అన్నారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, మీపై ఆధారపడి కుటుంబం ఉంటుందని, రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడతారని, మద్యం తాగి వాహనాలు నడపరాదని, రహదారి నియమ నిబంధనలు పాటిస్తూ గమ్యాన్ని చేరుకోవాలని తెలిపారు. హెల్మెట్ ధరించడం తప్పనిసరని, ధరించని వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం వాహన తనిఖీలు నిర్వహించి 210 మంది వాహనదారులకు రూ.35 వేల జరిమానా విధించారు. రెండు డ్రంక్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఆయన వెంట టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో షాలిని ప్రతిభ

కందుకూరు రూరల్: కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్ చదువుతున్న షాలిని ఒంగోలు ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచింది. రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు అనే అంశంపై ఈ నెల 8వ తేదీ నిర్వహించిన పోటీల్లో 400 మంది పాల్గొన్నారు. వీరిలో షాలిని ప్రతిభ చూపి రూ.1116 నగదు బహుమతి, ప్రశంస పత్రం అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ధర్మవరంలో తాగునీటి కష్టాలు

- నెల రోజులుగా నిలిచిన నీటి సరఫరా
- మరమ్మతులకు నోచుకోని డీప్‌బోరు
- పట్టించుకోని అధికారులు

మద్దిపాడు:

మండలంలోని ధర్మవరంలో 450 గృహాలకు చెందిన సుమారు 1700 మంది నివాసం ఉంటున్నారు. గ్రామస్తులకు ప్రధాన నీటి వనరు డీప్ బోరు మరమ్మతులకు గురైంది. దీంతో నెల రోజులుగా తాగు, వాడుక నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులతో పాటు పశువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వేసవిని తలపిస్తూ ఎండలు సైతం మండిపోతున్న తరుణంలో నీటికి గ్రామస్తులు పాట్లు పడాల్సి వస్తోంది. దీంతో గ్రామంలో ఉన్న చేతి పంపుల్లోని ఫ్లోరైడ్ నీరే దళితవాడ, ఓసీ, బీసీ కాలనీ వాసులకు దిక్కవుతోంది. జంగాలపల్లి సీపీడబ్ల్యూ స్కీమ్ కొనేళ్లుగా పని చేయడం లేదు. గత ప్రభుత్వంలో 2022 సంవత్సరంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో దాదాపు రూ.2 లక్షలు వెచ్చించి గ్రామానికి ఆనుకుని డీప్‌బోరు వేసి ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేశారు. ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి గ్రామస్తులకు తాగు, వాడుక నీరు అందించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామంలోని డీప్‌బోరు సుమారు 30 రోజుల క్రితం చెడిపోయింది. పట్టించుకునే అధికారులు కరువయ్యారు. దీంతో పశువులకు, గ్రామస్తులకు నీరు అందక ప్రజలు బబుల్స్ నీటిని ఆశ్రయిస్తున్నారు.



అలంకార ప్రాయంగా ఉన్న సంప్

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి వెంకట నారాయణను ‘సాక్షి’ వివరణ కోరగా ధర్మవరం గ్రామంలోని డీప్‌బోరు మరమ్మతులకు గురైన మాట వాస్తవమేనని, అయితే మోటారు మెకానిక్ అందుబాటులో లేకపోవడంతో త్వరితగతిన డీప్ బోరు మరమ్మతులు చేయించలేక పోయామని చెప్పారు. మరో మూడు రోజుల్లో మరమ్మతులు చేసి నీరు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

బిల్లులు రాకుండా చేస్తున్నారు:



ధర్మవరం పంచాయతీలో గత ప్రభుత్వంలో తాగుడు, వాడుక నీటి అవసరాల కోసం డీప్‌బోరు వేసి ట్యాంక్‌కు నీరు ఎక్కించి ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు అందించాం. గతంలో డీప్‌బోరు చెడిపోతే మరమ్మతులు చేయించా. మరమ్మతులు చేయించిన బిల్లులను కూడా తెలుగు దేశం పార్టీ నాయకులు మంజూరు కాకుండా చేశారు. ఇప్పుడు డీప్‌బోరు చెడిపోయి దాదాపు నెల అవుతున్నా మరమ్మతులు చేయించలా. పాత బిల్లులు చెల్లిస్తేనే మరమ్మతులు చేయించి గ్రామానికి నీరు అందిస్తా. అప్పటి వరకు నేనేమీ చేయలేను.

గంగిరెడ్డి రమణారెడ్డి, సర్పంచ్



నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్



మరమ్మతులకు గురైన డీప్ బోరు

టంగుటూరును కమ్మేసిన మంచు



పొలంలో మేఘంలా మంచు

టంగుటూరు: మండల కేంద్రం టంగుటూరును బుధవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 9 గంటలైనా పొగమంచు విడవక పోవడంతో వాహనదారులు, ప్రజలు ఎదురొచ్చే వాహనాలు కనపడక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టోల్‌ప్లాజా వద్ద వాహనదారులు రోడ్డు కనిపించక ప్రయాణం నిలిపేసుకున్నారు. పొలాలపై మంచు మేఘంలా పర్చుకుంది.



టంగుటూరు-కొండపి ఫ్లై ఓవర్ వద్ద పొగమంచు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



సైకిల్ ర్యాలీ చేస్తున్న యువకులు



ఛత్రపతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆరెమరాటీలు, నాయకులు

పామూరు: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు స్థానిక సీఎస్‌పురం రోడ్డులో ఆరెమరాటీసంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జాజం శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆరెమరాటీ సంఘం నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు చత్రపతి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యంకోసం, భారతదేశ ఔన్నత్యం, హిందూ సంస్కృతి సంప్రదాయాలకోసం ఛత్రపతి శివాజీ కృషి ఎనలేనిదన్నారు. ఈసందర్భంగా పట్టణంలో శోభాయాత్ర నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, ఇర్రి కోటిరెడ్డి, గుంటుపల్లి శ్రీనివాసులు, పందిటి హరీష్, ముప్పసాని రాఘవ, దైండే రామాంజనేయులు, శంకర్, జగదాబి మాల్యాద్రి పాల్గొన్నారు.

యువకులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

పొన్నలూరు: నేటి సమాజంలో యువకులు దేశభక్తిని పెంపొందించుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ మండల ప్రతినిధి చలపతిరావు అన్నారు. పొన్నలూరులో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ చూపిన చొరవతోనే భారత దేశం హిందూ దేశంగా కొనసాగుతుందన్నారు. యువత చెడు మార్గంలో నడవకుండా హిందూ సమాజం అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలన్నారు. హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. కార్యక్రమంలో గడ్డం సురేష్, కోటయ్య పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా

సీఎస్‌పురం(పామూరు): వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్ల నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఉదయం 10.30 గంటలకు ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తిచేసేందుకు అవసరమైన నిధులు కేటాయింపు కోరుతూ చేపట్టే ధర్నాకు మండలంలోని రైతులు, ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని ఏపీ రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వెంకటేశ్వరరెడ్డి, ఎం.రత్నారెడ్డి కోరారు.

సినిమా రంగానికి చెందిన మాల కొండయ్యకు నివాళులు

కందుకూరు రూరల్: లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెంది సినిమా రంగంలో పనిచేస్తున్న చిమ్మిరి మాలాకొండయ్య మంగళవారం గుండెపోటుతో అకాల మరణం చెందారు. కందుకూరు మండలం కోవూరు గ్రామానికి చెందిన వీడే మన వారసుడు సినిమా డైరెక్టర్ ఉప్పు రమేష్, తదితరులు మాలకొండయ్యకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులక ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మాలకొండయ్య సినిమా రంగంలో లైన్ ప్రొడ్యూసర్‌గా, నటుడిగా పనిచేశారు. మలినేని లక్ష్మయ్య నటించిన సినిమాల్లో కూడా పనిచేశారు. వీడే మన వారసుడు చిత్రానికి సహాయ సహకారాలు అందించారు.

బహుళ భాషలపై పట్టు సాధించాలి

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థులు బహుళ భాషలపై పట్టు సాధించడం ద్వారా సృజనాత్మకత పెంపొందించుకునే అవకాశం ఉందని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన భాషా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తెలుగు, హిందీ, ఆంగ్లంతో పాటు సంస్కృతం, ఉర్దూ, ఒరియా, తమిళం, కన్నడం వంటి భాషలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. భాషా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా రెండవ రోజు హిందీ భాషపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మణరావు, సీఆర్‌పీ సతీష్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మామిడి రైతులకు శిక్షణ

కందుకూరు రూరల్: ఉద్యానవనశాఖ, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా మామిడి రైతులకు ఈ నెల 21వ తేదీ కందుకూరులోని కేవీకేలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కేవీకే హెడ్ జి.ప్రసాద్ బాబు తెలిపారు. మామిడి పంటలో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు ప్రస్తుతం చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, అధిక దిగుబడులకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, ఎగుమతుల అవకాశాలు, కోత అనంతర చర్యలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులతో శాస్త్రవేత్తలు ముఖాముఖి కూడా నిర్వహించి వారి సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. మామిడి రైతులంతా శిక్షణలో పాల్గొనాలని కోరారు.

పంట నమోదు చేయించుకోవాలి



రావిగుంటపల్లెలో రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై సూచనలిస్తున్న ఏడీఏ



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో విజయ్‌కుమార్

కొండపి: 2024–25 పంట కాలానికి సంబంధించి మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పెద్దకళ్లగుంట, జాళ్లపాలెం, తాటాకులపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులు పంటల బీమా పథకంలో భాగంగా ఇన్సూరెన్స్ పంటలు శనగ, మినుము, వరి, మిరప పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. సొంత పొలం కలిగిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్న రైతులకు 11 అంకెల యూనిక్ నంబర్ ఇస్తారని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ, ఇన్పుట్ సబ్సిడీ, యంత్ర పరికరాలు, పంటల బీమా అందుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. ముందుగా గ్రామంలో ఉన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ మహేష్, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పామూరు: వ్యవసాయశాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు పొందాలంటే భూమి ఉన్న ప్రతి రైతు విధిగా ఫార్మర్ రిజిస్ట్రీ నిర్దేశిత గడువులోగా చేయించుకోవాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఫార్మర్ రిజిస్ట్రీ ఆవశ్యకత, చేయించుకును విధానం, కావాల్సిన డాక్యుమెంట్లపై రైతులకు అవగాహన చేశారు. అదేవిధంగా పంటలసాగులో మెళకువలు వివరించారు. కార్యక్రమంలో ఏఓ కంచం రాధ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): భూమి ఉన్న ప్రతి రైతు విధిగా ఈనెల 24వ తేదీలోగా స్థానిక రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు పూర్తిచేయించుకోవాలని వ్యవసాయాధికారి బత్తుల సంపత్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కోవిలంపాడు, పెదరాజుపాలెం, ఆర్‌కేపల్లి రైతుసేవాకేంద్రాల్లో నమోదుచేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వీఏఏలు హరీష్, అఖిల్‌బాబు, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

చిన్నారులకు సృజనాత్మక విద్యనందించాలి

వెలిగండ్ల.(హనుమంతునిపాడు): చిన్నారులకు అభ్యసన మెరుగుపరచడానికి జ్ఞానజ్యోతి కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు ఎంఈఓ రామిరెడ్డి తెలిపారు. శిక్షణలో భాగంగా బుధవారం రెండో రోజు శారీరక అభివృద్ధి, మేధాభివృద్ధి, భాషాభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ దాస్ ప్రసాద్, హెచ్‌ఎం కోర్సు డైరెక్టర్ రాఘవాచారి, సూపర్‌వైజర్ కమలకుమారి, ముక్కు వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా విద్య నేర్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఈఓ ఎస్ రమణయ్య అన్నారు. రెండో రోజు అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో ఆయన మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ గౌసేనీషాబేగం, కాంప్లెక్స్ చైర్మన్ సుబ్బారావు, ఆర్పీలు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్(హనుమంతునిపాడు): అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఎంఈఓ ఉడుముల నారాయణరెడ్డి పాల్గొన్నారు. పిల్లలు ఎలా నేర్చుకుంటారు అనే అంశంపై కార్యకర్తలకు రెండవ రోజు శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం జి.సంజీవ్, ఆర్పీలు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎంఈఓ రామిరెడ్డి

అన్నదానానికి రూ.50 వేల విరాళం

టంగుటూరు: మండలంలోని పసుకుదురులో రాములు వారిచే ప్రతిష్ఠించిన శివాలయంలో శివరాత్రి సందర్భంగా జరిగే అన్నదాన కార్యక్రమానికి 50 వేల రూపాయలు ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం బుధవారం అందించింది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం కార్యాలయంలో సంఘ గౌరవ అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు చేతుల మీదగా 50 వేల రూపాయలు శివాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. జిల్లా కమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆలా హనుమంతరావు, కాట్రగడ్డ రఘు, బాపయ్య చౌదరి, వెంకట నారాయణ, అబ్బూరి నవీన్, దుగ్గినేని వెంకట్రావు, గోగినేని శ్రీను, బొడ్డపాటి వెంకట్, దివి హరిబాబు, మన్నం సింగయ్య, రావుల సుబ్బనాయుడు, నార్నే రమేష్, నార్నే వెంకయ్య పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న సేవా సంఘ ప్రతినిధులు

రీసర్వేను తనిఖీ చేసిన ఆర్డీఓ



రీసర్వే రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవర్థన్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మంజునాథరెడ్డి

హనుమంతునిపాడు: మండల పరిధిలోని వీరరాంపురంలో జరుగుతున్న రీసర్వేను ఆర్డీఓ.కేశవర్ధన్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్వే చేస్తున్న రైతు భూమి సర్వే నంబర్లు, పట్టా నంబర్లు, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో తప్పిదాలు దొర్లకుండా ఒకటికి మూడు సార్లు పరిశీలించి సర్వే చేయాలన్నారు. అగ్రిగోల్డ్ భూములు, దేవదయ భూములు సర్వే నంబర్లు పరిశీలించి జాగ్రత్తగా సర్వే నిర్వహించాలన్నారు. సర్వేకు ముందు ప్రతి రైతుకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని సూచించారు. తహసీల్దార్ దిలీప్‌కుమార్, డీటీ కిషోర్‌రెడ్డి, సర్వే బృందం కాశిరెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ ఆలా శివ పాల్గొన్నారు.

రీసర్వేకు రైతులు సహకరించాలి

సీఎస్‌పురం(పామూరు): భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి అన్నారు. మండలంలోని కొండబోయినపల్లెలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పొలాలకు చెందిన ధ్రువీకరణ పత్రాలను సర్వే బృందానికి చూపి అధికారుల ద్వారా రీసర్వే చేయించుకుని హద్దులు వేయించుకోవాలన్నారు. మండలంలోని తుమ్మగుంటలో పొలానికి సంబంధించి రైతులు చేసిన ఫిర్యాదుపై ఆయన గ్రామంలో విచారణ చేశారు.

పలువురిని పరామర్శించిన బుర్రా



నాయకురాలిని సన్మానిస్తున్న బుర్రా

కందుకూరు: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కొచ్చర్ల మాల్యాద్రిని ఆ పార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మరో వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసులు అనారోగ్యం కారణంగా విశ్రాంతి తీసుకుంటుండగా, ఆయనను కూడా బుర్రా పరామర్శించారు.

బుర్రాను కలిసిన పలువురు నాయకులు...

వైఎస్సార్ సీపీ కందుకూరు నియోజకవర్గంలో వివిధ విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన నాయకులు బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఎంతో నమ్మకంతో పదవులకు ఎంపిక చేశారని, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా నాయకులను బుర్రా సన్మానించారు.



గొర్రెపాటి శ్రీనివాసులును పరామర్శిస్తూ..

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీ, సూపరింటెండెంట్, ఇన్‌స్పెక్టర్

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనలో మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకోసం అన్ని ఏర్పాట్లు పూర్తవుతున్నాయని ఎండోమెంట్ ఏసీ ఎం పానకాలరావు అన్నారు. బుధవారం త్రిముఖదుర్గాదేవి, భర్గలేశ్వర ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఏసీ పానకాలరావు, సూపరింటెండెంట్ జి.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భక్తులకు తాగునీరు, వైద్యం, టాయిలెట్స్, రాకపోకలకు ట్రాఫిక్ అంతరాయం మొదలైన ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఈఓ డి.వంశీకృష్ణారెడ్డికి సూచించారు. అనంతరం ఆలయంలో నిర్వహిస్తున్న పూజల్లో పాల్గొన్న వారికి అర్చకులు వేద ఆశీర్వచనంచేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు, అర్చకులు పాల్గొన్నారు.